
సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం ౹ 9 ౹ మార్చి ౹ 2025



భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం ఆరుద్రోత్సవం ఘనంగా జరిపారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (ఆదివారం సాయంత్రం)

సహర్ 5-14 (సోమవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.1 /12.5

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం

నాగర్‌కర్నూల్ క్రైం: కక్షిదారులు ఎవరైనా రాజీ మార్గం ద్వారా కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా జడ్జి రాజేష్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ కక్షిదారులకు ఒక మంచి అవకాశం అని, ఏళ్లతరబడిగా కోర్టుల చుట్టూ తిరగకుండా త్వరితగతిన కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ క్రమంలో శనివారం జిల్లాలోని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 33,582 కేసులు పరిష్కరించామని, రూ.66,18,763 నగదు వసూలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సబిత, సెకండ్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తి టౌన్: కక్షిదారుల రాజీమార్గంతోనే చాలా కేసులు పరిష్కారమవుతాయని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కల్వకుర్తి కోర్టు పరిధిలో 189 కేసులలో కక్షిదారులు రాజీపడ్డారన్నారు. సీనియర్ సివిల్ కోర్టులో రెండు ఓఎస్ కేసులు పరిష్కారం కాగా, మార్నింగ్ కోర్టులో 84 అడ్మిషన్ కేసులు పరిష్కారం కాగా, వాటికి సంబంధించి రూ.43,800 జరిమానాలు విధించారు. జూనియర్ సివిల్ కోర్టులో 103 కేసులకు పరిష్కారం లభించగా వాటిలో అడ్మిషన్ కేసులు 81 పరిష్కారమవ్వగా, రూ.2.3 లక్షల జరిమానా విధించారు. 21 లోక్ అదాలత్ కేసులలో రాజీ కుదరగా, ఒక సివిల్ కేసులో కక్షిదారులు పరిష్కారమయ్యారని జడ్జిలు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్య, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు పరిధిలోని పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి కావాల్సిన ఫర్నిచర్‌తో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించి ఆసక్తి ఉన్నవారు టెండర్ వేయవచ్చని జిల్లా జడ్జి రాజేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 వరకు సీల్డ్ కవర్‌లో కొటేషన్ వేయాలన్నారు. రెండు కంప్యూటర్లతోపాటు మూడు ప్రింటర్లు, ఒక వెబ్ కెమెరా, నాలుగు ఆఫీస్ టేబుళ్లు, రెండు అల్మారాలు, ఒక ఎయిర్ కూలర్, వాటర్ డిస్పెన్సర్‌కు టెండర్ వేయాలన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ మేరకు వెంటనే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అన్నారు. సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రథమ కార్యవర్గ సమావేశానికి సంఘం మురళి అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. అనంతరం పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ బకాయి డీఏలను ప్రకటించి, పీఆర్సీ నివేదిక తెప్పించాలన్నారు. అలాగే 2008 డీఎస్సీలో ఎంపికై ఇటీవల ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉపాధ్యాయులను సంఘంలోకి ఆహ్వానించి సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హన్మంతురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, అదనపు ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మారావు, రమేష్, కన్వీనర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్, రఘు రాంరెడ్డి, జమీల్ అహ్మద్, వరప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, బాలస్వామి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘కమర్షియల్’పై దృష్టి

మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన బహుళ అంతస్థుల భవనాల పన్నులు

- పన్ను వసూలుకు పుర అధికారుల ప్రత్యేక కార్యాచరణ
- భవనాల ముందు డప్పు కొట్టడం, సీజ్ చేస్తున్న వైనం
- జిల్లాలో రూ.18.67 కోట్లకు గాను రూ.8.21 కోట్లు మాత్రమే రాబడి
- మరో 22 రోజుల్లో ముగియనున్న గడువు



నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే పన్నుల రూపంలో వచ్చే ఆదాయమే దిక్కు. ఇందుకు ప్రధానంగా ఇంటి పన్నుల ద్వారానే అధిక మొత్తంలో ఆదాయం సమకూరుతుంది. అయితే జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పన్నుల వసూలు మందకొడిగా కొనసాగుతుండటంతో వాటి అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకు పన్నుల వసూళ్లపై పెద్దగా దృష్టిసారించని అధికార యంత్రాంగం.. ఈ నెలాఖరు వరకు వందశాతం వసూలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి రూ.18.67 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.8.21 కోట్లు మాత్రమే పన్నుల రూపంలో మున్సిపల్ సిబ్బంది వసూలు చేయడం జరిగింది. అయితే ఈ నెలాఖరు వరకు ఈ గడువు ఉండటం, కమర్షియల్ భవనాలపైనే ఎక్కువ శాతం పన్నుల రూపంలో పెండింగ్‌లో ఉండడంతో వాటిపై దృష్టిపెడుతున్నారు.

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఇలా..

మున్సిపాలిటీ	నివాసాలు	పన్ను (రూ.కోట్లలో..)	వసూలు (రూ.కోట్లలో..)	శాతం
నాగర్‌కర్నూల్	10,928	6.61	3.43	52
అచ్చంపేట	6,677	3.43	1.86	54
కల్వకుర్తి	8,151	7.37	2.20	30
కొల్లాపూర్	6,399	1.26	0.72	57

రాజకీయ ఒత్తిళ్లతో..

జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో ఇళ్లకు సంబంధించి పన్నులు వసూలు బాగానే ఉన్నా.. కమర్షియల్ భవనాలకు సంబంధించి వసూలు మాత్రం జరగడం లేదు. గత కొన్నేళ్లుగా పన్నులు కట్టకుండా ఉండడం, కొంత రాజకీయం ఒత్తిళ్లు కూడా ఉండడంతో అధికారులు కూడా కొన్ని సందర్భాల్లో చూసీచూడనట్లుగా వదిలేశారు. అయితే ప్రస్తుతం అధికారులపై కూడా పన్నుల వసూళ్లు చేయాలని ఒత్తిళ్లు వస్తుండటంతో కమర్షియల్ భవనాలపై ప్రత్యే శ్రద్ధ చూపుతున్నారు. ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉన్న ఫంక్షన్ హాళ్లు, ఇతర షట్టర్లకు నోటీసులు ఇవ్వడంతోపాటు కొన్నిచోట్ల వాటికి తాళం కూడా వేస్తున్నారు. ఇటీవల కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ ఫంక్షన్‌హాల్‌తోపాటు కొన్ని కమర్షియల్ భవనాలను సైతం సీజ్ చేయడం గమనార్హం. అంతే కాకుండా ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉన్న కమర్షియల్ భవనాల ముందు డప్పు చాటింపు వేసి పన్నులు కట్టేలా అవగాహన కల్పిస్తూ వినూత్న రీతిలో పన్నులు వసూలు చేస్తున్నారు. మరో 22 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఆయా మున్సిపల్ కమిషనర్లు వందశాతం వసూలు చేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తున్నారు.



కల్వకుర్తిలో పన్ను బకాయి ఉన్న ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

కల్వకుర్తి మినహా..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కల్వకుర్తి మినహా మిగతా మూడు మున్సిపాలిటీలు నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్‌లో మాత్రం పన్నులు కొంత మెరుగ్గానే ఉన్నాయి. అచ్చంపేటలో రూ.3.43 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.86 కోట్లు అంటే 54 శాతం వసూలు చేయడం జరిగింది. అలాగే కొల్లాపూర్‌లో రూ.1.26 కోట్లకు గాను రూ.72 లక్షలు అంటే 57 శాతం వసూలయ్యాయి. నాగర్‌కర్నూల్‌లో రూ.6.61 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. రూ.3.34 కోట్లు (52 శాతం) వసూలు చేశారు. అత్యధికంగా కల్వకుర్తిలో రూ.7.37 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం రూ.2.20 కోట్లు (30 శాతం) మాత్రమే వసూలు చేశారు. ఈ నాలుగు మున్సిపాలిటీల్లో ఈ నెలాఖరు 31 నాటికి వంద శాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యం ఉండటంతో అధికారులు ఆ దిశగా తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



మున్సిపాలిటీలో పన్నుల వసూళ్ల విషయంలో ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉన్న ఫంక్షన్ హాళ్లు, షట్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాం. నోటీసులు ఇచ్చినా స్పందించని వాటిని సీజ్ చేస్తున్నాం. అదేవిధంగా పన్నులు చెల్లించేలా డప్పులతో అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల చివరి నాటికి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం.

– మహమూద్ షేక్, మున్సిపల్ కమిషనర్, నాగర్‌కర్నూల్

ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

వనపర్తి రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని దళితవాడ, చిట్యాల రోడ్డులోని డబుల్‌బెడ్రూం ఇళ్లు, చందాపూర్ రోడ్డులోని పీర్లగుట్ట గంగిరెద్దుల కాలనీల్లో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని దళితవాడలో లోటట్టేజీ, శ్మశానవాటిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళితవాడ కందకంలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. చిట్యాల రోడ్డులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద తాగునీరు, వీధిలైట్లు, అంతర్గత రోడ్లు, మరుగుదొడ్లు, రేషన్‌షాపు లేక అవస్థలు పడుతున్నారని.. వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీని అనుసరించి చిరు వ్యాపారులు, మెకానిక్‌లు ఏర్పాటు చేసుకున్న డబ్బాలను రోడ్డు విస్తరణలో తొలగించడంతో రోడ్డున పడ్డారని.. వారికి అడ్డాలు చూపించి ఆదుకోవాలని కోరారు. పీర్లగుట్ట గంగిరెద్దుల కాలనీలో ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ. 2,500 చొప్పున ఇవ్వడంతో పాటు వృద్ధాప్య పింఛన్ రూ. 4వేలకు పెంచుతామని చెప్పి నేటికీ అమలు చేయడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎ.లక్ష్మితో కలిసి జాన్‌వెస్లీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, జబ్బార్, రాజు, పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, మధన్, బాలస్వామి, గట్టయ్య, రాములు, శ్రీను, బాలరాజు, రాబర్ట్, మద్దిలేటి, మన్యం, సాయిలీల పాల్గొన్నారు.



డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కొన్ని పనులకే పరిమితం



ఉప్పునుంతల మండలం లక్ష్మీపూర్ శివారులో భూ అభివృద్ధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గ్రామాల్లో ఈజీఎస్‌పై కొరవడిన అవగాహన

- ప్రయోజనం చేకూర్చేలా 266 రకాల పనులు
- ఐదారింటితోనే సరిపెట్టుకుంటున్న రైతులు, కూలీలు
- పట్టింపులేని అధికారులు, ప్రజాప్రతినిధులు

మొత్తం జాబ్ కార్డులు	యాక్టివ్‌గా ఉన్నవి
1,94,725	1,10,095
పనిచేస్తున్న కూలీలు	**ఈ ఏడాది పనిదినాల లక్ష్యం**
1,81,605	38.30 లక్షలు

ఉప్పునుంతల: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏయే పనులు చేసుకోవచ్చు.. ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చనే.. కనీస అవగాహన లేక ప్రతిఏటా చేసిన ఆ ఐదారు రకాల పనులే చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అయితే ఆయా పనులపై రైతులకు, కూలీలకు అవగాహన కల్పించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు అధికార యంత్రాంగం. ఈ పథకంలో దాదాపుగా 266 రకాల పనులు చేసుకోవడానికి అవకాశం ఉన్నా అందులో పట్టుమని పదికి మించి పనులు చేపట్టడం లేదు. 2006లో ఈజీఎస్ పథకం ప్రారంభమై దాదాపుగా 19 ఏళ్లు కావొస్తున్నా అప్పటి నుంచి ఇప్పటి వరకు కంపచెట్లు తొలగించడం, భూమి చదును చేసుకోవడం వంటి నామమాత్రపు పనులే ప్రధానంగా కనిపిస్తున్నాయి తప్పా ఇతర పనులతో ప్రయోజనం పొందడం లేదు. పనుల ఎంపికపై ఏడాదిలో ఒక్కరోజు గ్రామసభలు నిర్వహించి.. రైతులు, కూలీల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం అందుకు కారణమవుతుంది. దీంతో పథకం లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. ప్రస్తుతం యాసంగి సీజన్ వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. గత రెండు వారాలుగా కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు.

ప్రయోజనం చేకూర్చే పనులెన్నో..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే పలు రకాల పనులు ఉన్నాయి. కంపోస్టు ఎరువు గుంత, వ్యవసాయ పొలాల్లో పంట నూర్పిడి కళ్లాలు, వ్యవసాయ పొలాల్లోకి రోడ్లు వేసుకోవడం, భూ ఉపరితల నీటి కుంటలు, కొత్త సేద్యపు బావుల తవ్వకం, వర్మీ కంపోస్టు పిట్‌లు, కొత్తగా పంట కాల్వల ఏర్పాటు, ఉమ్మడి భూముల్లో పశువుల నీటి కోసం కుంటల నిర్మాణం, పశువులు, జీవాల తాగునీటి తొట్టెల నిర్మాణాలు, పశువులు, మేకల పాకలు, కోళ్ల ఫారం నిర్మాణాలు, గడ్డి పెంపకం, భూమి సరిహద్దు చుట్టూ కందకాలు తవ్వడం, చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణాలు, శ్మశాన వాటికల స్థలాల అభివృద్ధి, శ్మశాన వాటికల వద్దకు రోడ్లను వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రహదారుల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, రైతుల పంట పొలాల గట్లపై మొక్కల పెంపకం, తాటి వనాల పెంపకం వంటి పలు రకాల పనులను చేపట్టి రైతులు వ్యక్తిగతంగాను, సామూహికంగా ఈజీఎస్‌లో ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో ఈజీఎస్‌లో చేసుకునే అవకాశం ఉన్న పనులపై రైతులు, కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవగాహన లేకనే..



జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎన్నో రకాల పనులు చేసుకునే అవకాశం ఉన్నా మాకు తెలియకపోవడంతో ప్రయోజనం పొందలేకపోతున్నాం. గ్రామాలు, తండాల్లో వారం రోజులు గ్రామ సభలు నిర్వహించి ఈజీఎస్‌లో చేసుకునే అవకాశం ఉన్న పనులపై అవగాహన కల్పిస్తే బాగుంటుంది. ఇన్నేళ్లు గడిచినా ఈజీఎస్‌తో మేం ఏమాత్రం ప్రయోజనం పొందలేదు. ఇప్పటికైనా మాలో అవగాహన కలిగించి ప్రోత్సహిస్తే వాటిని ఉపయోగించుకుంటాం.

– పూల్యానాయక్, రైతు, గుట్టమీదితండా, ఉప్పునుంతల మండలం

గ్రామసభల్లో వివరిస్తున్నాం..



ఈజీఎస్‌లో పనుల ఎంపిక కోసం అక్టోబర్ 2న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి పూర్తిగా పనుల వివరాలను వివరిస్తున్నాం. పథకంలో నిర్దేశించిన పనులు చేసుకోవడానికి ముందుకు వచ్చే రైతుల పొలాల్లో పనులు చేయించడానికి సిద్ధంగా ఉన్నాం. జాబు కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న చిన్నకారు రైతులు తాము చేయించుకోదలిచిన పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తు చేసుకుంటే పనులు చేయిస్తాం. జాబ్‌కార్డులేని కూలీలు దరఖాస్తు చేసుకుంటే జాబ్‌కార్డులు అందజేసి పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పశువుల మేతగా అజోలా పెంపకం, సేంద్రియ ఎరువుల తయారీ, పశువుల పాక నిర్మాణం వంటివి ఈజీఎస్‌లో ప్రోత్సహిస్తున్నాం.

– సుదర్శన్‌గౌడ్, ఈజీఎస్ ఏపీఓ, ఉప్పునుంతల మండలం

రేపు ఉమామహేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

అచ్చంపేట: శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరస్వామి ఆలయ హుండీ డబ్బుల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అదేరోజు భోగమహేశ్వరంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయానికి, నూతన శివుడి తోరణం విగ్రహానికి శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బ్యాటరీ, సెల్ టెక్నాలజీపై పరిశోధన

కేంద్ర రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రస్తుతం బ్యాటరీ, సెల్ టెక్నాలజీపై పరిశోధనలు, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినివైష్ణవ్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ నగర శివారులోని దివిటిపల్లి ఐటీ పార్కు ఆవరణలో మొత్తం రూ.3,225 కోట్లతో ఏర్పాటు చేయనున్న అమరరాజా గిగా ఫ్యాక్టరీ-1, అల్టమిన్, లోహం మెటీరియల్స్, ఎస్సెల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్లకు ఆయనతో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కేంద్ర మంత్రి తన ప్రసంగాన్ని తెలుగులో ‘నమస్తే.. బాగున్నారా..!’ అని ప్రారంభించారు. ఈ సందర్భంగా పుష్ప సినిమాలోని ‘పుష్ప తగ్గేలే..’ డైలాగ్‌ను ప్రస్తావిస్తూ ‘దివిటిపల్లి అభివృద్ధి ఆగదు.. ఇక నిరంతర అభివృద్ధే..’ అని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి అమరరాజా కంపెనీలో 80 శాతం మహిళలే పనిచేస్తుండటం అభినందనీయమన్నారు. కాగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకితో పాటు మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



అమరరాజా గిగా ఫ్యాక్టరీ శంకుస్థాపనలో కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

అన్ని రకాలుగా అండగా ఉంటాం: మంత్రి శ్రీధర్‌బాబు

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఇటీవల దావోస్ సమ్మిట్‌లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వివిధ పెద్ద సంస్థలు సుమారు రూ.78 వేల కోట్లకు ఎంఓయూ కుదుర్చుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. వారికి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ, చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ దివిటిపల్లిలో ఏర్పాటు చేస్తున్న గిగా ఫ్యాక్టరీ ద్వారా సుమారు 4,500 మందికి ప్రత్యక్షంగా, మరో పది వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీజీఐఐసీ వీసీ అండ్ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ అడుగడుగునా ఆటంకాలు



టీబీఎం నమూనాను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- సొరంగంలో చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు
- 15 రోజులైనా లభ్యం కాని కార్మికుల ఆచూకీ
- ఉబికివస్తున్న నీటితో సహాయక చర్యలకు విఘాతం

– అచ్చంపేట

వివరాలు 8లో..

క్లుప్తంగా

బాలుడి ప్రాణం తీసిన వాటర్ హీటర్


పవన్‌కుమార్ (ఫైల్)

మల్దకల్: వాటర్ హీటర్ ఓ బాలుడి ప్రాణం తీసింది. ఈ ఘటన మల్దకల్ మండలం ఉలిగేపల్లిలో తీవ్ర విషాదం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. ఉలిగేపల్లికి చెందిన కుర్వ నాగేంద్ర – జయమ్మ కుమారుడు పవన్‌కుమార్ (8) గ్రామంలోని పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంట్లో ఆడుకుంటున్న బాలుడు.. వేడి నీటి కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ వాటర్ హీటర్‌ను పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్: తాగునీరు అనుకొని పొరపాటున గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పాన్‌గల్ మండలం శాగాపూర్‌కు చెందిన పుట్టపాగ శ్రీనివాసులు (47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి రోజు సాయంత్రం వేళలో ఇంటికి మద్యం తెచ్చుకొని తాగే అలవాటు ఉంది. మూడు రోజుల క్రితం తన పొలంలోని మామిడితోటకు పిచుకారీ చేయగా మిగిలిన గడ్డి మందును వాటర్ బాటిల్‌లో పోసి ఇంట్లో పెట్టాడు. ఈ నెల 7న రోజు మాదిరిగానే బయటి నుంచి మద్యం తెచ్చుకున్న శ్రీనివాసులు.. ఇంట్లో ఉంచిన మంచి నీరు బాటిల్ అనుకొని పొరపాటున గడ్డి మందు ఉన్న బాటిల్ తీసుకుని మద్యంలో కలుపుకొని తాగాడు. కొద్దిసేపటికి తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య అలివేల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వివాహిత..

లింగాల: ప్రమాదవశాత్తు బావిలో పడి వివాహిత మృతిచెందిన ఘటన లింగాల మండలం కొత్తకుంటపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు.. కొత్తకుంటపల్లికి చెందిన చెంచు మహిళ అనూష (19) తన భర్త పరుశరాములు, చిన్నమ్మ ఎల్లమ్మతో కలిసి గ్రామ సమీపంలోని బావి వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లింది. బట్టలు ఉతుకుతున్న క్రమంలో అనూష ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. భర్త రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెల కాపరి..

ఆత్మకూర్: అనుమానాస్పద స్థితిలో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన ఆత్మకూర్ మండలం తూంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ వివరాల మేరకు.. మండలంలోని గుంటిపల్లికి గొల్ల చెన్నయ్య (48)కు తూంపల్లికి చెందిన పద్మతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మూడునెలల క్రితం పద్మ తన పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే చెన్నయ్య గ్రామంలోని తన ఇంటిని అమ్ముకుని పక్షం రోజుల క్రితం భార్య వద్దకు వెళ్లిపోయాడు. తన వద్ద ఉన్న గొర్రెలు, పశువులను కాస్తూ తూంపల్లిలోనే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి గ్రామ శివారులో అతడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి సోదరి గొల్ల మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు తులాల బంగారం చోరీ

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన శనివారం పట్టణంలోని హమాలీకాలనీలో చోటుచేసుకుంది. పరుశరాముడు కూలీ పనులుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారిలాగే తన కుమారుడు ఇళ్లు పక్కనే ఉండడంతో రాత్రి నిద్ర పోయేందుకు వెళ్లాడు. తను ఉంటున్న ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. ఉదయం ఇంటికొచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకొని సమాచారం సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడుగడుగునా ఆటంకాలు

సొరంగంలో చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు

- 15 రోజులైనా లభ్యం కాని కార్మికుల ఆచూకీ
- ఉబికివస్తున్న నీటితో సహాయక చర్యలకు విఘాతం


సొరంగం ప్రమాదంలో శిథిలాలను తొలగిస్తున్న సహాయక బృందం


సొరంగంలో గ్యాస్ కట్టర్ కట్ చేస్తున్న రెస్క్యూ బృందం

అచ్చంపేట: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. 15 రోజులైన వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఎనిమిది మందిని గుర్తించేందుకు చేపడుతున్న సహాయక చర్యలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఇప్పటి వరకు 13.50 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లిన రెస్క్యూ బృందాలు మిగిలిన 50 మీటర్ల ముందుకు వెళ్లడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. సొరంగంలోకి నీటి ఊట వేగంగా వస్తుండటంతో ప్రత్యేక మోటార్ల ద్వారా నీటిని బయటికి తోడేస్తున్నారు. కన్వేయర్ బెల్ట్ పూర్తిగా మరమ్మతు జరగడంతో.. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. సొరంగంలో పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, టీబీఎం విడిభాగాలు (ఇనుము), ఊడిపోయిన కాంక్రీట్ సెగ్మెంట్లను తొలగించే రోబోలు తయారు చేసేందుకు కనీసం వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే రోబోలు సాయం వారం రోజుల తర్వాతే వినియోగంలోకి వస్తోంది.

డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో..

ప్రమాదం జరిగిన సొరంగంలో పరిశోధన చేసేందుకు కేరళ నుంచి వచ్చిన కాడవర్ డాగ్స్ కూడా ఇది వరకు గుర్తించిన డాగ్స్ స్థానాల్లోనే గుర్తించాయి. 13.500 కి.మీ., అవుతల ఒకే దగ్గర ముగ్గురు వ్యక్తుల అవశేషాలు ఉన్నట్లు నిర్ధారించాయి. కార్మికులు చిక్కుకున్నట్లు డాగ్స్ చూపించిన ప్రదేశాల్లో శనివారం రెస్క్యూ బృందాలు తవ్వకాలు ప్రారంభించాయి. టీబీఎం పరికరాలు గ్యాస్ కట్టర్‌తో కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా సొరంగం బయటికి పంపించారు. కూలిపడిన పైకప్పు మట్టి దిబ్బలను హిటాచీతో ఒకవైపు తరలిస్తున్నారు. రోజుకో బృందాన్ని సింగరేణి నుంచి రప్పించి సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నారు. సొరంగంలో వస్తున్న దుర్వాసన సహాయక చర్యలకు ఇబ్బంది కలిగిస్తోంది.


నీటి ఊటను తోడిపోస్తున్న మోటార్లు

ఈ ఘటన జాతీయ విపత్తు

టన్నెల్‌లో జరిగిన ప్రమాదం జాతీయ విపత్తు అని, అందులో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికత ఉపయోగిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం టన్నెల్‌ను సందర్శించిన ఆయన రెస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు ఇప్పటి వరకు జరిగిన పురోభివృద్ధి గురించి రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆర్మీ కమాండెంట్ పరీక్షిత్ మెహ్రా మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సహాయక చర్యల్లో అవంతరాలను అధిగమిస్తూ వేగంగా ముందుకెళ్తున్నామని, సొరంగం లోపల ఆక్సిజన్ సరిగా లేకపోవడం, నీటి ఊట అధికంగా రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. టీబీఎం దృఢమైన లోహ శకలాలు, రాళ్లు, మట్టితో కూరుకుపోయి ఇబ్బందులు ఉన్నప్పటికీ సహాయక చర్యలు కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో పనిచేసే కార్మికులకు, అధికారులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మిలటరీ ఇంజినీర్ వికాస్‌సింగ్, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్నకుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రభాకర్, సింగరేణి, రైల్వే, ఎన్‌జీఆర్ఐ, హైడ్రా తదితర బృందాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లాడు..

- రెండున్నర నెలల క్రితం గుండెపోటుతో మృతి
- శనివారం స్వగ్రామం చేరుకున్న మృతదేహం
- అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబీకులు


సబావత్ రవి(ఫైల్)

హన్వాడ: బతుకుదెరువు కోసం 16ఏళ్ల క్రితం భార్యాపిల్లల్ని వదిలి ఓ వ్యక్తి సౌదీకి వలస వెళ్లాడు. రెండున్నర నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందగా శనివారం అతడి మృతదేహం స్వగ్రామం చేరగా కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని రామాలయంతండాకు చెందిన సబావత్ రవి(45) 16 ఏళ్ల క్రితం సౌదీకి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన ఏడాదికే అతడిపై మోసానికి సంబంధించిన కేసు నమోదైంది. దీంతో తప్పించుకు తిరిగిన రవి వీసా గడువు కూడా ముగియడంతో స్వదేశానికి వచ్చే వీలు లేకుండాపోయింది. భార్యాపిల్లలకు దూరమై దుర్భరమైన ఏడాది జీవితాన్ని అనుభవించాడు. గత జనవరి 26న గుండెపోటుతో మృతి చెందాడు. అతని శవాన్ని స్వదేశానికి తరలించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్థానిక బీజేపీ నాయకులు ఎంపీ డీకే అరుణ దృష్టికి ఈవిషయాన్ని తీసుకెళ్లారు. ఆమె స్పందించి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రితో మాట్లాడి మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించారు. శనివారం మధ్యాహ్నం మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా సాయంత్రం కుటుంబీకులు అంత్యక్రియలు చేశారు. మృతుడు సౌదీ వెళ్లే సమయంలో అతని కూతురు పూజకు మూడు నెలలు. ప్రస్తుతం ఆమె స్థానిక కేజీబీవీలో 9వ తరగతి చదవుతున్నాడు. కుమారుడు సచిన్ (7వ తరగతి వరకే) చదివి మధ్యలో ఆపేసి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటున్నాడు. భార్య తారాబాయి ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తోంది. మృతుడి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రపతిని ఆకట్టుకున్న గద్వాల చేనేత చీరలు


గద్వాల చేనేత చీరలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

గద్వాలటౌన్: రాష్ట్రపతి భవన్‌లో గద్వాల చేనేత చీరల ప్రదర్శన ఆకట్టుకుంది. అమృత్ కా మహోత్సవ్‌లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో దక్షిణ భారతంలో ప్రసిద్ధి చెందిన హస్తకళలు, హ్యాండ్‌ల్యూమ్, అథెంటిక్ సౌత్ ఇండియా ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషనల్‌లో తెలంగాణ నుంచి 40 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో 25 చేనేత రంగానికి సంబంధించినవి ఉన్నాయి. ఖండాంతర ఖ్యాతి గడించిన గద్వాల చేనేత జరీ చీరలు ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గద్వాల చీరలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరీ చీరల ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనలో సంఘం నాయకులు అక్కల శాంతరాం, అక్కల శ్రీనివాసులు, మంత్రి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


కన్నయ్య (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..ధర్మపూర్ గ్రామానికి చెందిన కన్నయ్య(34), దేవరకద్రకు చెందిన శివరాజ్‌తో కలిసి శుక్రవారం రాత్రి 11.30 ప్రాంతంలో ఏపీ 11కె 7109 నంబర్ కలిగిన బైక్‌పై దేవరకద్ర నుంచి మన్యంకొండ దేవస్థానంలో నిద్రచేసేందుకు బయల్దేరాడు. మన్యంకొండ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కన్నయ్యకు, శివరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కన్నయ్యను మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం


అన్నాభిషేకంలో బాలబ్రహ్మేశ్వర స్వామి


అలంపూర్ క్షేత్రంలో గోమాతతో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

అలంపూర్: ఐదో శక్తిపీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం ఆరుద్రోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద అర్చక స్వాములు గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రదక్షిణలు, దర్బార్ సేవలు నిర్వహించారు. ఆలయంలోని రససిద్ధి గణపతికి అభిషేకాలు, పంచామృత అభిషేకాలు విశేషంగా జరిగాయి. అనంతరం బాలబ్రహ్మేశ్వరస్వామిని పండ్ల రసాలు, పంచామృతాలు, మంగళద్రవ్యాలతో అభిషేకించారు. అన్నసూక్త పఠనంతో స్వామి వారికి శ్వేతాన్నంతో అభిషేకాలు జరిగాయి. అన్నాన్ని లింగాకృతిలో అలంకరించి.. బిల్వదళాలు, వివిధ రకాల పూలతో అష్టోత్తర అర్చనలు, పంచభక్ష పరమాన్నాలతో మహా నైవేద్యాలు సమర్పించారు. భక్తులు స్వామివారి నామాన్ని స్మరిస్తూ అభిషేకాలు చేశారు. అదే విధంగా ఏక హారతి, నేత్ర హారతి, బిల్వ హారతి, వేద హారతి, కర్పూర పంచక హారతి, రథ హారతి, చక్ర హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతులతో శతవిధ నీరాజనాలు సమర్పించారు. ఆరుద్రోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్చక స్వాములు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా


రోడ్డుపై ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

ఊర్కొండ: బైక్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలోని కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై బంధువులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాంరెడ్డిపల్లి గ్రామ నివాసి అయిన చిన్న వెంకటయ్య (54) శుక్రవారం రాత్రి కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై కాలినడకన స్వగ్రామం వెళ్తున్నాడు. ఈక్రమంలో బైకు బలంగా ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య తెరపోగు పద్మ, కుమారుడు, కూతురు పిల్లలు ఉన్నారు. కూలీ పనిచేస్తే తప్ప డొక్కాడని బాధిత కుటుంబానికి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఎస్ఐ కృష్ణదేవ ధర్నా వద్దకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. నాయకులు హరీష్, జంగారెడ్డి, ఆంజనేయులు, సుజీవన్ రెడ్డి, లాలయ్య తదితరులు ఉన్నారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి మృతి

కోడేరు: చేపల వేటకెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మైలారంలో శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. వివరాలు.. పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లికి చెందిన సంగనమోని రాముడు(46) మైలారం గ్రామ సమీపంలోని కుంటలో చేపలు పట్టేందుకు వచ్చాడు. ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్నవారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చీరకు నిప్పంటుకొని వృద్ధురాలు..

చిన్నచింతకుంట: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని ఓవృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలం ఉంద్యాలలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. వివరాలు... ఉంద్యాలకి చెందిన వెంకటమ్మ (65) శనివారం మధ్యాహ్నం తన ఇంటి ముందు ఉన్న చెత్తకుప్పకు నిప్పు పెట్టింది. ప్రమాదవశాత్తు ఆమె చీర కొంగుకు నిప్పు అంటుకుంది. ఒంటిపై ఉన్న బట్టలు పూర్తిగా కాలిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వాళ్లు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది. మృతురాలి కూతురు అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోలో నుంచి దూకి మహిళ మృతి


అనూష (ఫైల్)

దేవరకద్ర రూరల్: క్షణికావేశంలో ప్రయాణిస్తున్న ఆటోలో నుంచి దూకి ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని నార్లోనికుంట్ల గ్రామానికి చెందిన కురుమూర్తికి అడవి అజిలాపూర్ గ్రామానికి చెందిన పాలెం అనూష(20)తో ఏడాది క్రితం వివాహమైంది. వీరికి ఇటీవల కుమారుడు జన్మించడంతో రెండు రోజుల క్రితం భర్త ఇంటి దగ్గర బారసాల నిర్వహించారు. ఆ ఫంక్షన్‌లో అత్తాకోడలుకు చిన్నపాటి వివాదం జరిగింది. ఈ క్రమంలోనే తనను ఇంటికి తీసుకెళ్లాలని అనూష బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్న తన తల్లితండ్రులను కోరింది. భర్త కురుమూర్తి కూడా హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తుండటంతో భార్య, కొడుకుతో కలిసి ఆటోలో హైదరాబాద్‌కు బయలుదేరారు. దేవరకద్ర సమీపంలోకి రాగానే అనూష మూడు నెలల కుమారుడిని ఆటోలో వదిలేసి దూకింది. ఈ ఘటనలో అనూష తలకు తీవ్రగాయాలు కాగా, చికిత్స కోసం దేవరకద్ర ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

వరి ధాన్యం.. బియ్యం అపహరణ..?

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు రైస్‌మిల్లులో పడి వరి ధాన్యం, బియ్యం బస్తాలను అపహరించినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్ గ్రామ శివారులో రైస్‌మిల్లును ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున గుర్తుతెలియని దుండగులు మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం, బియ్యం, నూకల బస్తాలు అపహరించారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే మిల్లులో పనిచేసే వ్యక్తులే చోరీ చేసి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలుస్తుంది. చోరీ ఘటన విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం సీఎంమ్మార్ ద్వారా వరి ధాన్యంను మిల్లర్లకు కేటాయించిన విషయం విదితమే.. పలువురు మిల్లు యాజమానులు ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యంను బయటి మార్కెట్లో విక్రయాలు చేసినట్లు ఇంటిలిజెన్సీ, విజిలెన్స్ అధికారులు గుర్తించి ప్రభుత్వంకు నివేదికలను అందజేశారు. మరోవైపు సివిల్ సప్లై శాఖ అధికారులు, మిల్లర్లు కలసి పెద్దఎత్తున వరి ధాన్యంను గోల్‌మాల్ చేసినట్లు అధికారులు గుర్తించి అక్రమాలకు పాల్పడిన సిబ్బంది వివరాలు సైతం రాష్ట్ర ప్రభుత్వంకు ఇటీవల అందజేసిన విషయం తెలిసిందే. వరి ధాన్యంకు సంబంధించిన వ్యవహారంలో బియ్యంను ప్రభుత్వానికి సరఫర చేయాల్సి ఉంటుందనే యోచనతో మిల్లు వ్యాపారి ఈ ఫిర్యాదు చేసి ఉండవచ్చని కొంత మంది మిల్లర్లు విమర్శలు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వాస్తవ విషయాలు వెలుగులోకి వస్తే పలు విషయాలు బహిర్గతం అయ్యే అవకాశం ఉంది. ఈ సంఘటనపై రూరల్ ఎస్ఐ శ్రీకాంత్‌ను 'సాక్షి' సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రేషన్ బియ్యం పట్టివేత



జడ్చర్ల: మండలంలోని నసరుల్లాబాద్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. నసరుల్లాబాద్‌లోని రేషన్ డీలరు అన్వర్ పాష నిర్వహిస్తున్న రేషన్ దుకాణం దగ్గర ఓ బొలెరో వాహనంలో 40బస్తాల రేషన్ బియ్యం ఉండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ జయప్రసాద్ వెంటనే గ్రామానికి చేరుకొని సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారమిచ్చి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనంలో మొత్తం 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసల్దార్ ఆదిత్యగౌడ్ వివరాలు సేకరించి పంచనామ నిర్వహించారు. నసరుల్లాబాద్‌కు చెందిన కురుమూర్తి రేషన్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. డ్రైవర్ రాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

లింగాల: స్థానిక ఎస్సీ వాడలో ఉన్న కమ్యూనిటీ భవనంలో అక్రమంగా తరలించుటకు నిల్వ ఉంచిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం స్వాధీన పర్చుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. వివిధ రేషన్ షాపుల ద్వారా అక్రమంగా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించుటకు సిద్ధంగా ఉంచినట్లు సమాచారం అందింది. అచ్చంపేట సీఐ రవీందర్ ఆకమ్యూనిటీ భవనాన్ని పరిశీలించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై అధికారులకు సమాచారమిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

KAKATIYA GROUP GADWAL
KAKATIYA HIGH SCHOOL, GADWAL
NOW HIRING!
We are looking for passionate and qualified educators and staff to join our team.Fluency in English is mandatory. Interested candidates can visit the school with their resume and original certificates.

Vacancies & Salary Details

PGT (High School Teachers)	₹ 20,000 to ₹ 45,000	(Regular, IIT & NEET Coaching) Mathematics, Chemistry, Physics, Biology.
PGT (High School Teachers)	₹ 20,000 to ₹ 30,000	Hindi Pandit, Telugu, English, Social Studies
TGT (Middle & Primary Teachers)	₹ 15,000 to ₹ 25,000	Telugu, Hindi, English, Science, Social Studies, Mathematics, Computer
Pre-Primary Teachers	₹ 12,000 to ₹ 20,000	(Mother Teachers)
PET	₹ 15,000 to ₹ 25,000	(Physical Education Teachers)
Non-Teaching Staff	Non Teaching Staff ₹ 15,000 to ₹ 20,000	Computer Operator, Accountant, Record Assistant
Non-Teaching Staff	Negotiable	Aayas, Office Boys, Drivers

FREE FOOD & ACCOMMODATION FOR NON LOCAL CANDIDATES
Contact : 9703212340, 9032723565

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి. లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర: 8376001873, 96430 10487, 8376089771, 011-25920179

HEALTH CARE

ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98666.

WANTED
■ HYD- రియల్ ఎస్టేట్ Co.కి మార్కెటింగ్ Exe. కావలెను, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+ 2వీలర్+రూం+ఫో-ఫ్రీ.age 34,నె.లక్ష రూ. ఫ్రెష్/Exp.7416396781

FACULTY TEACHERS
■ WANTED TEACHERS Upanishad International School Kosgi, Narayanpet(D) Ph: 7989-417-503; 799-33-91279

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఏకీకృతంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్